సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 21 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.3 వేలు, సరాసరిన రూ.15 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.8°/14.9°

జిల్లా వ్యాప్తంగా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉదయం పొంగమంచు తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

కదిరి అర్బన్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతు హుస్సేన్ మంగళవారం జిల్లాకు విచ్చేస్తున్నారు. బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన జిల్లాకు చేరుకోనున్న ఆయన, తొలుత కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం మండల పరిధిలోని బోడేనాయక్ తండా, రాందాస్‌నాయక్ తండాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

ప్రత్యేక న్యాయమూర్తిగా రమణయ్య



ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

హిందూపురం అర్బన్: స్థానిక ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా ఎస్. రమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ప్రత్యేక న్యాయమూర్తి నాలుగేళ్ల క్రితం పదవీ విరమణ పొందడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను హైకోర్టు భర్తీ చేసింది. ఈ క్రమంలోనే విశ్రాంత జడ్జి రమణయ్యను హిందూపురం ప్రత్యేక న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజను మర్యాద పూర్వకంగా కలిశారు. అదే విధంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యను కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఎస్.రమణయ్య గతంలో హిందూపురం మెజిస్ట్రేట్‌గా, ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేశారు. అలాగే అనంతపురంలోని కార్మిక న్యాయస్థానం జడ్జిగా పనిచేస్తూ జిల్లా జడ్జి స్థాయిలో పదవీ విరమణ పొందారు.

కదిరి వాసికి అరుదైన గౌరవం



మంగు హనుమంతరావ్

కదిరి అర్బన్: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) మధురై డైరెక్టర్‌గా ఉన్న కదిరి వాసి డాక్టర్ మంగు హనుమంతరావ్‌కు అరుదైన గౌరవం దక్కింది. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలంటూ రాష్ట్రపతి భవన్ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. వైద్యరంగంలో జాతీయస్థాయిలో పేరుగాంచిన ప్రముఖుల్లో ఈ ఏడాది 15 మందికి మాత్రమే ఆహ్వానాలు అందగా, హనుమంతరావ్ కూడా ఒకరు. తిరుపతి స్విమ్స్‌లో డైరెక్టర్‌గా 30 ఏళ్ల పాటు సేవలందించిన హనుమంతరావ్...అంతర్జాతీయ వైద్య విజ్ఞాన పత్రికల్లో 100కుపైగా ప్రచురణలు చేశారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం (2025–26 విద్యా సంవత్సరం) దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 8వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతికి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1,084 మంది విద్యార్థులు, 11వ తరగతిలో ప్రవేశానికి 1,228 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఆయన వెల్లడించారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం లేపాక్షి నవోదయ విద్యాలయతో పాటు మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా 11వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం హిందూపురంలోని నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. www.navodaya.in వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

'పీఎం ఇంటర్న్‌షిప్'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

పుట్టపర్తి: నిరుద్యోగ యువత పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం ఆయన కొత్తచెరువులోని విలేకరులతో మాట్లాడారు. 'పీఎం ఇంటర్న్‌షిప్' పథకం అమలు కోసం ప్రభుత్వం 500 కంపెనీలతో ఒప్పందం చేసుకుందన్నారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అలాగే వన్‌టైమ్ గ్రాంటు కింద రూ.6 వేలు, ప్రతి నెల రూ.5 వేల చొప్పున ఇస్తారన్నారు.



- పుట్టపర్తికి చెందిన 36 ఏళ్ల విజయ్‌కి డిసెంబరు చివరి వారంలో జలుబు చేసింది. డాక్టర్‌ను సంప్రదించకుండానే గూగుల్‌లో వెతికి రెండు , మూడు రకాల మాత్రలు కొని వేసుకున్నాడు. అలాగే కొన్ని కషాయాలు తాగాడు. జలుబుతో పాటు దగ్గు, జ్వరం ఎక్కువై గొంతు బొంగురుపోయి మాట్లాడేందుకు కూడా ఇబ్బందికాగా, వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు మోతాదుకు మించి మందులు తీసుకోవడంతో సమస్య తలెత్తినట్లు గుర్తించి చికిత్స అందించారు. ఇందుకు రూ.10 వేల వరకు ఖర్చు అయినట్లు బాధితుడు తెలిపాడు.
- ధర్మవరానికి చెందిన 55 ఏళ్ల రమాదేవికి జనవరి మొదటి వారంలో జ్వరం వచ్చింది. తనకు తెలిసిన ఓ వ్యక్తికి ఫోన్ చేసి.. మందుల గురించి ఆరా తీసింది. అతని సలహా మేరకు మెడిసిన్ తెచ్చుకుని ఒక రోజు మింగింది. మరుసటి రోజున ఉదయం నుంచి వాంతులు కావడంతో పాటు నీరసం వచ్చి స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబీకులు ఓ ప్రైవేటు డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన పలు పరీక్షలు చేసిన తర్వాత.. రోగానికి సంబంధం లేని మాత్రలు మింగడంతో సమస్య వచ్చిందని తేల్చారు. అప్పటికే సుమారు రూ.5 వేల వరకు ఖర్చు అయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

సొంత వైద్యం..
మొదటికే మోసం

- డాక్టర్లను సంప్రదించకుండానే మందుల వినియోగం
- అతి తెలివితో అనారోగ్యం బారిన పడుతోన్న ప్రజలు
- రోగానికి అనుగుణంగా మందుల కోసం గూగుల్‌లో సెర్చ్
- కొత్త రోగాలు కొని తెచ్చుకుంటున్న వైనం
- మెడికల్ స్టోర్లలో ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు

సాక్షి, పుట్టపర్తి

ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే మెడికల్ షాపునకు వెళ్లి ఏదో యాడ్‌లో చూపించే టాబ్లెట్ వేసుకోవడం కొందరికి అలవాటు. ఇంకొందరు మాత్రం గూగుల్‌లో వెతికి మరీ మందులు కొంటున్నారు. ఈ సొంతం వైద్యం ఇటీవల పల్లెలకూ పాకింది. పనిమీద పట్టణాలకు వచ్చిన గ్రామీణులు మందుల షాపు కనిపించగానే.. ఐదారు రకాల మందులు కొని ఇంటికి తీసుకెళ్లడం పరిపాటిగా మారింది. ఇలా కొంటున్న వాటిలో పారాసిటమాల్ మాత్రలు ఎక్కువగా ఉంటున్నాయి.



జబ్బు ఏదైనా సొంత వైద్యమే!

ఒళ్లు నొప్పులు, తలనొప్పి, జ్వరం, జలుబు ఏది వచ్చినా.. చాలా మంది డాక్టర్‌ను సంప్రదించకుండానే ఇంట్లో ఉన్న మాత్రలను మింగేయడం అలవాటుగా మార్చుకున్నారు. పట్టణాల్లో అయితే అప్పటికప్పుడు గూగుల్ సెర్చ్ చేసి కొత్త రకాల మందులను వాడేస్తున్నారు. ఇటీవల కాలంలో డాక్టర్లను సంప్రదించకుండా మందులు తీసుకుని అప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనం పొందుతున్న జిల్లావాసుల సంఖ్య పెరిగిపోతోంది. అయితే అలాంటి వారందరూ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అతి తెలివితోనే అనర్థాలు..

సొంత వైద్యం చేసుకుంటున్న వారిలో విద్యావంతులు, ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. ఆస్పత్రులకు వెళ్లలేక.. చేతిలో స్మార్ట్‌ఫోన్ చూస్తూ.. గూగుల్‌లో పరిశోధించి మెడిసిన్ కొనుగోలు చేస్తున్నారు. అలాంటి మందులు తాత్కాలిక ఉపశమనం ఇచ్చినా.. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాలామంది కిడ్నీ బాధితుల గత ఆరోగ్య చరిత్ర ఆరా తీయగా... అతిగా మాత్రలు వేసుకోవడం.. ఇష్టారాజ్యంగా మెడిసిన్ తీసుకోవడంతోనే సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది.

విచ్చలవిడిగా విక్రయాలు..

కొన్ని మందులు వైద్యుల సూచన మేరకే వాడాల్సి ఉంటుంది. కాసులకు కక్కుర్తి పడుతున్న కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. వ్యాపారం కోసం ఇష్టానుసారం విక్రయాలు చేస్తున్నారు. ఫలితంగా సొంత వైద్యం చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది.

> **సొంత వైద్యం ప్రమాదమే**
>
> జబ్బు చేసినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించి మందులు వాడితే మంచిది. సొంత వైద్యం ఎప్పటికీ ప్రమాదమే. గూగుల్‌లో పరిశోధించి కొనుగోలు చేసే మాత్రలతో రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. డాక్టర్ వద్దకు వెళ్తే రోగ తీవ్రత ఆధారంగా మాత్రల మోతాదు ఇస్తారు. అతి తెలివి ప్రదర్శించి లేనిపోని రోగాల బారిన పడొద్దు. జబ్బు ముదిరి ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుంది. గూగుల్‌లో దొరికే సమాచారం అంతా కచ్చితమైనది కాకపోవచ్చని గమనించాలి.
>
> – డాక్టర్ ఫైరోజబేగం,
> జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

30న జెడ్పీ సమావేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సోమవారం ఆమోదం తెలిపారు. వాస్తవంగా ఫిబ్రవరి 7న సమావేశం నిర్వహించాలని జెడ్పీ అధికారులు భావించారు. అయితే అదే నెల ఒకటో తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. దీంతో తమ నిర్ణయాన్ని జెడ్పీ అధికారులు మార్చుకుని,. కొత్తతేదీ ఫైల్‌ను చైర్‌పర్సన్‌కు పంపగా ఆమె ఆమోదం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కో–ఆప్షన్, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులకు సమాచారం పంపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది.

శ్రీ సత్యసాయి కలెక్టర్ వస్తారా..?

జెడ్పీ సమావేశాలకు, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ డుమ్మా కొడుతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు కూడా రావట్లేదు. ఈ అంశంపై సభ్యులు, ప్రజాప్రతినిధులు నిలదీస్తూ వస్తున్నారు. పునర్విభజన తరువాత తొలిసారి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బసంత్‌కుమార్ మాత్రమే క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరయ్యేవారు. ఆ తరువాత వచ్చిన కలెక్టర్లు జెడ్పీ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ అంశంపై గత సమావేశంలో ప్రజాప్రతినిధులు, సభ్యులు గట్టిగా నిలదీశారు. కలెక్టరే లేకుంటే ఇక తామెందుకు రావాలని అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ రాకపోతే వచ్చే సమావేశాన్ని బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అయితే అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కలుగజేసుకొని వచ్చే సమావేశానికి కచ్చితంగా ఆయన వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే సమావేశానికైనా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ వస్తారా లేదా చూడాలి.

ఎస్సీ ఉపకులాల సమగ్ర వివరాలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా, చిత్రంలో కలెక్టర్లు వినోద్‌కుమార్, టీఎస్ చేతన్, ఎస్పీ జగదీష్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధికారులు

- అధికారులకు ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదేశం
- ఎస్సీ సంఘాల ప్రతినిధుల నుంచి 237 వినతులు

అనంతపురం అర్బన్/ఎడ్యుకేషన్: ఎస్సీ ఉపకులాల వారీగా సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీల జనాభా తదితర వివరాలను కమిషన్ చైర్మన్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 40.81 లక్షలు కాగా, ఇందులో ఎస్సీల్లో 48 ఉపకులాలకు సంబంధించి జనాభా 5.83 లక్షలు (14.29 శాతం) ఉందని పేర్కొన్నారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు 4,75,632 మంది, మాల సామాజిక వర్గానికి చెందిన వారు 73,525 మంది, మిగిలిన ఉపకులాలకు చెందిన వారు 33,843 మంది ఉన్నారని చెప్పారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, 4, క్లాస్–4, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 48,080 మంది ఉన్నారన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, వైద్య, పారామెడికల్, నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఉపకులాలకు చెందిన విద్యార్థులు 4,15,677 మంది ఉన్నట్లు వివరించారు. మునిసిపల్, హౌసింగ్, మెప్మా, డీఆర్‌డీఏ బ్యాంక్ లింకేజీ, ఉపాధి హామీ తదితర పథకాల ద్వారా లబ్ధిపొందిన ఎస్సీ, ఉపకులాల వారి వివరాలను తెలియజేశారు.

కచ్చితమైన వివరాలు అందించాలి

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఎస్సీ, ఉప కులాలకు సంబంధించి కచ్చితమైన వివరాలను సేకరించాలని ఆదేశించారు. వివరాల సేకరణలో తప్పిదాలు చోటు చేసుకుంటే న్యాయపరమైన సమస్యలు వస్తాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా పని చేయాలని చెప్పారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వి నూత్న, డీఆర్‌ఓ ఎ.మలోల, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సంఘాల నుంచి 237 వినతులు

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, మాల మహాసభ, ఎస్సీ కులాల జేఏసీ, జంగం హక్కుల పోరాట సమితి, ఇతర సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగుల నుంచి 237 వినతులు అందాయి.

- కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలు పెరిగి పోయాయని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు వరికూటి కాటమయ్య ఏక సభ్య కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే చైర్మన్ స్పందిస్తూ... ఈ నెల 31న నియోజకవర్గంలోని వెంకటాపురం గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించి, సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికార యంత్రాంగానికి సూచించారు.
- ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన మాదిగ, ఉప కులాలకు న్యాయం చేయాలని రాజీవ్ రంజన్ మిశ్రాను పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, గృహ నిర్మాణాలు, భూమి కొనుగోలు పథకం, స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నియామకాల్లోనూ కర్షకులు, కార్మికులకు ఎలాంటి లబ్ధి జరగలేదన్నారు. వర్గీకరణ జరిగితేనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

'యంగ్ ఇండియా' బేడీ ఇక లేరు

వయోభారంతో కన్నుమూసిన సామాజిక ఉద్యమకారుడు



నరేంద్ర సింగ్ బేడీ (ఫైల్), బేడీ మృతదేహం

పెనుకొండ రూరల్: యంగ్ ఇండియా ప్రాజెక్టును స్థాపించి..ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ హక్కుల కోసం ఉద్యమించిన నరేంద్ర సింగ్ బేడీ(86) ఇకలేరు. వయో భారంతో సోమవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ఫారంలోని తన నివాసంలో కన్నుమూశారు. బేడీ 1939 సంవత్సరంలో కోల్‌కతాలో జన్మించారు. అమెరికాలో కెమికల్ ఇంజినీరింగ్ చదివి..కొంతకాలం అక్కడే ఉద్యోగం చేశారు. 1969లో స్వదేశానికి తిరిగొచ్చారు. 1975–76 మధ్య కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండకు వచ్చారు. పెనుకొండ మండలం గుట్టూరు వద్ద 44వ జాతీయ రహదారికి సమీపంలో యంగ్ ఇండియా ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించారు. తీవ్ర కరువు, పేదరికంతో జిల్లా కొట్టుమిట్టాడుతున్న ఆ రోజుల్లో రైతులు, గ్రామీణ శ్రామికులు, పేదల హక్కుల కోసం ఉద్యమించారు. భూ పోరాటాలతో పాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. యంగ్ ఇండియా ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేశారు. రైతు సహకార, వ్యవసాయ కూలీల, మహిళా సంఘాలను ఏర్పాటు చేసి.. ఆయా వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వృద్ధిలోకి వచ్చేలా చైతన్య పరిచారు. దివ్యాంగులకు చేయూతనిచ్చారు. చేతి వృత్తిదారులు, కళాకారులను ప్రోత్సహించారు. విద్య, వైద్య, కరువు నివారణ, సుస్థిర వ్యవసాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకున్నారు.

ఉపాధి హామీ కోసం ఉద్యమం..

పేదల అభివృద్ధికి ప్రభుత్వాల చేయూత కావాలనే సంకల్పంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం నరేంద్ర సింగ్ బేడీ ఉద్యమించారు. గుట్టూరులోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ప్రాంగణం నుంచి సంస్థ సభ్యులతో కలసి ఢిల్లీ వరకు సైకిల్ యాత్ర చేపట్టి అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీకి వినతి పత్రం ఇచ్చారు. అలాగే లక్ష సంతకాలు సేకరించి.. సైకిల్ ర్యాలీగా వెళ్లి అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో అప్పటి కేంద్ర కార్మిక శాఖ మంత్రి గుడిసెల రామస్వామికి వినతి పత్రం అందచేశారు. పేదరిక నిర్మూలనే కాకుండా, గ్రామాల అభివృద్ధికి సాధనంగా పనిచేసేలా గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టాలంటూ తన ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. అలాగే చుండూరులో దళితులపై దాడులు, మారణహోమాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజనులను చైతన్య పరిచారు. 1983లో భూ పోరాటాల్లో పాలుపంచుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలను రాజకీయంగా చైతన్య పరిచారు. ప్రశ్నించే హక్కును అలవాటు చేశారు. నరేంద్ర సింగ్ బేడీ.. మణిశంకర్ అయ్యర్, దిగ్విజయ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్ లాంటి ప్రముఖులకు సమకాలికులు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ..బేడీకి మూడేళ్ల జూనియర్. ఈయనకు భార్య సోనియాబేడీ, కుమారులు రాజీవ్, సంజయ్, కుమార్తె తారా ఉన్నారు.

నేడు అంత్యక్రియలు..

నరేంద్ర సింగ్ బేడీ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పురంలో నకిలీ నోట్ల కలకలం



సోమవారం హిందూపురంలోని ఓ దుకాణదారుడికి ఇచ్చిన దొంగనోటు ముందు, వెనుక భాగాలు

హిందూపురం అర్బన్: జిల్లాలో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. నెలరోజుల క్రితం బత్తలపల్లిలో ఓ చిరువ్యాపారికి, ఇటీవలే కదిరిలో ఓ గొర్రెల వ్యాపారికి రూ.32 వేల విలువ జేసే రూ.500 నకిలీ నోట్లు అంటగట్టిన వైనం మరవకముందే తాజాగా సోమవారం హిందూపురంలోనూ నకిలీనోట్లు కలకలం సృష్టించాయి. ఓ చిల్లర దుకాణదారుని వద్ద నిత్యావసర సరకులు కొనుగోలు చేసిన వ్యక్తి సోమవారం రూ.500 నోట్లు మూడు ఇచ్చాడు. అయితే వాటిని మరో వ్యక్తికి ఇచ్చే తరుణంలో అవి నకిలీవని గుర్తించిన వ్యాపారి వెంటనే వాటిని చించేశాడు. ఫిర్యాదు చేస్తే విచారణ పేరుతో పోలీసుల నుంచి ఇబ్బందులు వస్తాయన్న భయంతోనే వ్యాపారి నకిలీ నోట్లను చించేసినట్లు తెలుస్తోంది. రోజుకోచోట నకిలీ నోట్లు చేతులు మారుతుండటంతో ఏది నకిలీ.. ఏది అసలో గుర్తించలేక జనం ఆందోళనకు చెందుతున్నారు. అసలు నోటును పోలిన నకిలీ నోట్లు మార్కెట్‌లో చలామణి చేస్తుండటంతో ప్రతి నోటు చూసి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నకిలీ నోట్లను ఇలా గుర్తిస్తున్నారు

- నకిలీ నోట్లపై మధ్యన త్రెడ్ ఉన్నా... నోటు తిప్పినప్పుడు అది బ్లూ కలర్ రంగులోకి మారడం లేదు.
- నోటు చివర మీడ్‌లైన్స్ (నల్లగా ఉండే చారలు) ఉబెత్తుగా కాకుండా మామూలుగా ఉంటున్నాయి.
- నోటుకు ఎడమ చివర భాగంలో ఫ్లవర్‌పై 500 నంబర్ ఉండటం లేదు.
- నోటు ముందుభాగంలోని గాంధీ బొమ్మ సరిగ్గా కనిపించడం లేదు. వీటిని బట్టి వ్యాపారులు నకిలీ నోట్లను గుర్తించ గలుగుతున్నారు. అయితే సామాన్యులు నకిలీ నోట్లు గుర్తించక ఇబ్బందులు పడుతున్నారు.

కోయంబత్తూరు, చెన్నైయ్ నుంచే సరఫరా..?

నకిలీ కరెన్సీ నోట్లు కోయంబత్తూరు, చెన్నైయ్‌లలో ముద్రించి కర్ణాటక మీదుగా జిల్లాలోకి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువగా ఒక రూ.500 నోట్లే ఉంటున్నాయి. అసలు నోటుకు మూడు నకిలీ నోట్లు ఇవ్వడం, కొందరి అమాయకుల వద్ద నేరుగా మార్చడం చేస్తున్నారు. ప్రధానంగా 9ఎఫ్‌బీ 248053, 2టీవీ 175028 సీరీస్ గల నకిలీ నోట్లు జిల్లాలో బయట పడ్డాయి. కదిరి, హిందూపురం, మడకశిర, ధర్మవరం ప్రాంతాల్లో నకిలీ నోట్ల మారకం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సచివాలయ ఉద్యోగులకు చార్జ్‌మెమో

- 11 గంటలైనా తెరచుకోని తంబాపురం సచివాలయం
- ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఎంపీడీఓకు పంపిన గ్రామస్తుడు



ఉదయం 11 గంటలకు కూడా తెరచుకోని తంబాపురం సచివాలయం

బత్తలపల్లి: సమయపాలన పాటించని తంబాపురం గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఉన్నతాధికారులు చార్జ్‌మెమోలు జారీ చేశారు. ఉదయం 9 గంటలకే విధుల్లో ఉండాల్సిన వారు 11 గంటలైనా అందుబాటులోకి రాకపోవడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చర్యలు ఉపక్రమించారు.

తలుపుకూడా తీయకపోవడంతో..

ఆధార్ అప్‌లోడ్ చేసుకునేందుకు పలువురు స్థానికులు సోమవారం ఉదయం 10 గంటలకే సచివాలయం వద్దకు చేరుకున్నారు. అయితే 9 గంటలకే కార్యాలయానికి హాజరుకావాల్సిన ఉద్యోగులు ఒక్కరు కూడా విధులకు హాజరు కాలేదు. 11 గంటలవుతున్నా సచివాలయం తలుపులు తెరిచేవారు కనిపించకపోవడంతో... గ్రామస్తులు ఫొటోలు తీసి ఎంపీడీఓ కార్యాలయానికి వాట్సాప్ ద్వారా పంపారు. స్పందించిన ఏఓ శ్రీనివాసులు విషయంపై ఆరా తీశారు. సచివాలయంలో 10 మంది ఉద్యోగులున్నా ఒక్కరూ విధులకు హాజరు కాలేదని తెలిసి అందరికీ చార్జ్ మోమో ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది ఇచ్చే వివరణతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

డీపీఓ సమీపంలో ఎగిసి పడిన మంటలు



జిల్లా పోలీసు కార్యాలయం ప్రహరీ వద్ద వ్యాపించిన మంటలు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) సమీపంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం కార్యాలయం ఆవరణలోని ఎండుగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఘటనను ఎస్పీ రత్న తీవ్రంగా పరిగణిస్తూ సెంట్రీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిప్పు రాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రేటర్ రాయలసీమ ఇమామ్ మౌజన్ కౌన్సిల్ ఏర్పాటు



ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ముస్లిం నగారా కార్యాలయంలో గ్రేటర్ రాయలసీమ ఇమామ్ మౌజన్ కౌన్సిల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఖాజీ అన్సార్ పాల్గొన్నారు. కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా మౌలానా వసీవుల్లా, హిందూపురం పట్టణ అధ్యక్షుడిగా మౌలానా తన్వీర్ అహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇమామ్ మౌజన్ల హక్కుల కోసం కౌన్సిల్ చట్ట బద్ధంగా పోరాడుతోందన్నారు. అనంతరం గ్రేటర్ రాయలసీమ ఇమామ్ మౌజన్ కౌన్సిల్ క్యాలండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉబెదుల్లా హుస్సేన్, మౌలానా రిజా-ఉర్-రహమాన్, మౌలానా ఉస్మాన్ ఘనీ, మౌలానా సాజిద్, మౌలానా షాబుద్దీన్, మౌలానా అన్సారీ, హాజీ నాసీర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామానికి చెందిన రామాంజప్ప (50) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఆయన జులాయిగా కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు డబ్బు కావాలంటూ తరచూ కుటుంబసభ్యులను వేధించేవాడు. సోమవారం మద్యం కొనుగోలుకు తనకు డబ్బులివ్వాలంటూ భార్య సంజమ్మ, కుమారుడు, కుమార్తెను వేధించాడు. తమ వద్ద డబ్బు లేదని తెలపడంతో గ్రామంలోని పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై సంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



చెవి రింగులు, గాజులు, బుట్టలు, ప్లేట్లు, గ్లాసులు, పాదరక్షలు, డోర్ మ్యాట్లు, యోగా మ్యాట్లు, శానిటరీ న్యాప్కిన్లు, పేపర్, హ్యాండ్ బ్యాగ్‌లు, పూల బుట్టలు, చీరలు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకట్రెండు కాదు... ఏకంగా 25 రకాల ఉత్పత్తులు అరటి నుంచి వచ్చినవే. మీరు చదివింది నిజమే. ఇవన్నీ అరటి నుంచి తయారు చేసినవే. అరటి చెట్టు వ్యర్థాలతో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పడమే కాదు... ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇస్తూ అరటి వ్యర్థాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకున్న వారికి బాసటగా నిలుస్తోంది జిల్లాలోని లేపాక్షి ఎంపోరియం.

అరటి వ్యర్థం... ఉపాధి మార్గం



- అరటి నుండి అందమైన ఉత్పత్తులు
- హస్తకళలకు లేపాక్షి ఎంపోరియం బాసట



అరటి నారను వేరు చేస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లాలో అరటి సాగు చేసే రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే అరటి గెలలను మార్కెటింగ్ చేసిన తర్వాత ఆ చెట్లను కొట్టేసి పడేయడం తప్ప రైతులకు మరో అవకాశం లేదు. ఎందుకంటే ప్రతి అరటి చెట్టు తన జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే దిగుబడి ఇస్తుంది. ఆ తరువాత అది వ్యర్థంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఆ చెత్తను తొలగించడం కూడా రైతులకు పెద్ద సమస్యగానే ఉంటోంది. రైతులు వృథాగా పడేసే అరటి బోదెలతో పలు రకాల ఉప ఉత్పత్తులు తయారు చేయవచ్చని నిరూపించడమే కాకుండా వాటి తయారీలో పలువురికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'ఒక జిల్లా – ఒక క్రాఫ్టు'తో వెలుగులోకి

జిల్లా విభజన అనంతరం 'అనంత'కు మరో ప్రత్యేక గుర్తింపు దక్కింది. జిల్లాలో 10 వేల హెక్టార్లలో అరటి సాగులో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్- వన్ క్రాఫ్ట్ కింద 'బనానా ఫైబర్' (అరటి నార)తో అందమైన గృహోపకరణాల తయారీని అనంతపురం జిల్లాకు కేటాయించింది. ఈ ఉత్పత్తులకు లేపాక్షి హస్తకళల సంస్థ అన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించడమే కాక అదే స్థాయిలో విక్రయాలను ప్రోత్సహిస్తోంది. అరటి బెరడు నార తీసి దానితో ఎన్నో వస్తువులను తయారు చేయగల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కూడేరు, అనంత నగర శివారులో ప్రత్యేక శిక్షణ కేంద్రాలను నెలకొల్పారు. అరటి వ్యర్థాల నుంచి కళాత్మక వస్తువుల తయారీపై వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన 'మూసా ఫైబ్రల్' సహకారంతో శిక్షణ అందజేస్తున్నారు.



అరటి నారతో చేసిన చీర

మంచి పేరు వచ్చింది



మూసా ఫైబ్రల్ అందించిన శిక్షణ, లేపాక్షి హస్తకళ వారి సహకారంతో అరటి వ్యర్థం నుంచి అనేక రకాల వస్తువులను తయారు చేయడం నేర్చుకున్నా. నాతో పాటు చాలా మంది శిక్షణ పొందారు. మాలోని సృజనను జోడించి చేస్తున్న బుట్టలు, హ్యాంగింగ్స్‌కు ఎంతో మంచి పేరు వచ్చింది. – జమీలా, కురుకుంట, అనంతపురం రూరల్ మండలం

రెండు నెలల శిక్షణ



అనంతపురం, పులివెందుల, కడపను ఓ యూనిట్‌గా తీసుకుని ఆయా ప్రాంతాల్లో ఔత్సాహిక మహిళలకు అరటి వ్యర్థంతో వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. గత ఏడాది ఆగస్టు నుంచి కురుకుంట వద్ద శిక్షణ మొదలు పెట్టాం. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుంది. – శ్రీనివాస్, ఎండీ, మూసా ఫైబ్రల్, కడప

హస్తకళలను ప్రోత్సహించాలి



దేశ ఔన్నత్యాన్ని చాటే సంప్రదాయ హస్తకళలకు లేపాక్షి ఎంపోరియం ఎంతో ప్రాచుర్యం కల్పిస్తోంది. ప్రస్తుతం అరటి ఉపఉత్పత్తులనూ ప్రోత్సహిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి బాసటగా ఎంపోరియం నిలుస్తోంది. – శ్రీనివాసులు, మేనేజర్, లేపాక్షి ఎంపోరియం, అనంతపురం

సత్ప్రవర్తన అలవర్చుకోండి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్

ధర్మవరం అర్బన్: సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సబ్ జైలులోని ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్ సూచించారు. సోమవారం ధర్మవరంలోని సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూం, బ్యారక్‌లు, రికార్డులు పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కోర్టు కేసుల్లో వాదనలు వినిపించేందుకు న్యాయవాది లేని వారు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ బ్రహ్మేంద్రరెడ్డి, న్యాయవాదులు కృష్ణమూర్తి, బాలసుందరి, పారా లీగల్ వలంటీర్ షామీర్‌బాషా పాల్గొన్నారు.

- పెనుకొండ: స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సోమవారం తనిఖీ చేసారు. బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూం, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై మాట్లాడారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి భార్యాపిల్లలతో సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ అజగర్ హుస్సేన్, ప్యారా లీగల్ వలంటీర్ నరసప్ప, పెనుకొండ, అనంతపురం కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.
- హిందూపురం అర్బన్: క్షణికావేశంలో తప్పులు చేసి జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలందరూ అధికారుల దృష్టిలో ఒక్కటేనని జిల్లా సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాది సంతోషికుమారి, ఉప కారాగార అధికారి హనుమన్న, లోక్ అధాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వలెంటీర్ సురేష్ పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు తాళలేకపోతున్నా...

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీకి ఫిర్యాదు



అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న బయిపరెడ్డి (చిత్రంలో) ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: తారాస్థాయికి చేరుకున్న అదనపు కట్నం వేధింపులు తాళలేకపోతున్నానంటూ ఎస్పీ రత్న ఎదుట బాధితురాలు బోరుమంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీకి వినతి పత్రం అందజేసి, మాట్లాడింది. వివరాలు... చిలమత్తూరు మండలం సోమగట్ట గ్రామానికి చెందిన సురేష్‌కుమార్‌కు మూడేళ్ల క్రితం కదిరి పట్టణానికి చెందిన అపరంజినితో వివాహమైంది. కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ సమయంలోనే ఆమె గర్భం దాల్చింది. ఊహించని పరిణామాలతో అబార్షన్ జరిగి ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. అప్పటి నుంచి భర్త, అత్త, మామ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే ఓ సారి బాధితురాలి తల్లి రూ.2 లక్షలు అందజేసింది. అయినా అత్తింటి వారిలో మార్పు రాలేదు. అదనపు కట్నం కోసం చిత్రహింసలు చేయసాగారు. తాము కోరుకున్న మొత్తం తీసుకురాకపోతే హతమార్చి మరో పెళ్లి చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ ఎస్పీ రత్నను బాధితురాలు వేడుకుంది. దీనిపై స్పందించిన ఎస్పీ వెంటనే కదిరి పీఎస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. బాధితురాలికి న్యాయం చేయాలని సూచించారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 65 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సార్

బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన రౌడీ షీటర్ నాగిరెడ్డి తనను చీటింగ్ చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఈ విషయంగా తనకు న్యాయం చేయాలంటూ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఎదుట రాశింపల్లికి చెందిన బయపరెడ్డి వాపోయాడు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. నాగిరెడ్డితో రూ.6 లక్షల అప్పు తీసుకుని రూ.లక్షకు ఒకటి చొప్పున ఆరు ప్రాంసరీ నోట్లను రాసి ఇచ్చినట్లు వివరించారు. ఏడాది తర్వాత రూ.6 లక్షలకు అసలు, వడ్డీ కలిపి చెల్లించానన్నారు. ఆ సమయంలో ఐదు ప్రాంసరీ నోట్లు తిరిగి ఇచ్చి ఒకటి కనిపించడం లేదంటూ తెల్ల కాగితంపై డబ్బు అంతా ముట్టినట్లు రాసిచ్చాడన్నారు. ఇటీవల తనకు డబ్బు చెల్లించాలంటూ ఇంటికి వచ్చి కుటుంబసభ్యులను దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ విషయంగా తనకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. దీనిపై స్పందించిన అడిషనల్ ఎస్పీ వెంటనే బుక్కపట్నం పీఎస్ ఎస్ఐ కృష్ణమూర్తితో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 251 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం జేసీ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడి వరకూ వచ్చి అర్జీలిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలన్నారు. అర్జీదారుడితో నేరుగా మాట్లాడితే సమస్య క్షుణ్ణంగా తెలుస్తుందని, అప్పుడు పరిష్కారం సులువు అవుతుందన్నారు. పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించినట్లు చూపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌస్ హోల్డ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులు, వివిధ కేసుల్లో కోర్టు ఆదేశాలను క్షుణ్ణంగా చదివి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

రూ.1.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ శివ నారాయణ స్వామి, (ఇన్‌సెట్) పట్టు బడిన గంజాయి

కదిరి టౌన్: గంజాయి రవాణా చేసే 9 మంది సభ్యులుగల ముఠాను ఎన్పీకుంట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శివనారాయణ స్వామి కదిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన బాలాజీ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అర్జున్ నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తుంటారు. ఇందుకోసం 8 మందితో ఓ ముఠా ఏర్పాటు చేశాడు. ఇందులో భాగంగా సోమవారం గంజాయి ముఠా సభ్యులు ఎన్పీకుంట మండలానికి గంజాయి రవాణా చేస్తుండగా... ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా తన సిబ్బందితో కలిసి వలపన్ని బాలాజీతో పాటూ మరో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.5 లక్షలు విలువ చేసే 5 గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టు ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే...

- ప్రియుడితో కలసి భర్తను హతమార్చిన భార్య
- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసులు



హత్యాకేసులో ఇరువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

హిందూపురం అర్బన్: వ్యక్తి హత్యకేసులో మిస్టరీని హిందూపురం పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో భర్తను హతమార్చిన భార్య, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సోమవారం హిందూపురం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అబ్దుల్ కరీం వెల్లడించారు. స్థానిక రహమత్‌పుర ప్రాంతానికి చెందిన అల్లాబకాష్ (33)కు తొమ్మిదేళ్ల క్రితం కర్ణాటకలోని దొడ్డబళ్లాపుర పట్టణానికి చెందిన తబ్సుంతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆటో నగర్‌లోని బీరువాల తయారీ కర్మాగారంలో అల్లాబకాష్ దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తబ్సుం... తమ ప్రాంతంలోనే ఇంటి వద్ద కూరగాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న నదీముల్లా పరిచయమయ్యాడు. ఈ పరిచయం కాస్త ఇద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. అల్లాబకాష్ పనికి వెళ్లినప్పుడు ఇద్దరూ శారీరకంగా కలుసుకునేవారు. ఈ విషయం భర్తకు తెలిసి మందలించాడు. దీంతో తమ వివాహేతర సంబంధానికి అడ్డు చెబుతున్నాడని కక్ష పెంచుకున్న ఇద్దరూ పథకం వేశారు. ఇందులో భాగంగానే ఈ నెల 18న తెల్లవారుజాము 5 గంటల ప్రాంతంలో అల్లాబకాష్ గాఢ నిద్రలో ఉన్నప్పుడు ప్రియుడిని తన ఇంటికి తబ్సుం పిలిపించుకుంది. అల్లాబకాష్‌ను నదీముల్లా గట్టిగా పట్టుకోగా తబ్సుం చున్నీతో గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి హతమార్చింది. అనంతరం నదీముల్లా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత భర్త మృతదేహంపై బెడ్‌షీట్ కప్పి తన ఆడపడచు సుమియాకు ఫోన్ చేసి 'మీ తమ్ముడు ఆరోగ్యం సరిగా లేక నిద్రించాడని, ఎంత లేపినా మేల్కొనడం లేదని' తెలిపింది. దీంతో స్థానికంగా ఉన్న అల్లాబకాష్ కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో ఇంటి వద్దకు చేరుకున్నారు. తబ్సుం ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో గద్దించారు. దీంతో చేసిన నేరాన్ని ఆమె అంగీకరించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో తబ్సుంను, ఆటోనగర్ క్రాస్ వద్ద నదీముల్లాను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

తాడిమర్రిలో ముగిసిన ఇస్తెమా



ఇస్తెమాలో పాల్గొన్న ముస్లింలు

తాడిమర్రి: మండల కేంద్రంలో ఆదివారం ప్రారంభమైన ఇస్తెమా సోమవారం ముగిసింది. రెండో రోజు రాత్రి 8 నుంచి 9 గంటల వరకు మత గురువు మౌలానా ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో సుమారు 80 వేల మంది ముస్లింలు పాల్గొన్నారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ రకాల సామగ్రిని కొనుగోలు చేయడానికి ముస్లింలతో పాటు స్థానికులూ ఆసక్తి చూపారు.

హర్యానా మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం అర్బన్: అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న హర్యానా మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు సోమవారం శిర– కొడికొండ జాతీయ రహదారిపై కొల్లకుంట క్రాస్ వద్ద ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మారుతీ సుజికి వ్యాగనర్ కారులో హర్యానా రాష్ట్రానికి చెందిన వివిధ బ్రాండ్ల మద్యం 90 బాటిళ్లు పట్టుబడింది. మద్యం తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో హిందూపురం మండలం సుబ్బిరెడ్డిపల్లికి చెందిన శ్రీనాథ్, ముద్దిరెడ్డిపల్లికి చెందిన గురిజాల బాలేంద్ర, దాసరి నవీన్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ బంగారం ముఠా సభ్యులు?

సోమందేపల్లి: నకిలీ బంగారం అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం రాత్రి సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామ సమీపంలో ఎనిమిది మంది బంగారం అమ్మడానికి ప్రయత్నం చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిని పెనుకొండ పీఎస్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

కిడ్నాప్ కలకలం

సోమందేపల్లి: మండల కేంద్రం సమీపంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ఓ హోటల్ కార్మికుడిని హిందూపురానికి చెందిన వ్యక్తులు కారులో కిడ్నాప్ చేశారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. హిందూపురానికి చెందిన అశోక్ రూ.40వేలు అప్పుగా తీసుకుని చెల్లించకుండా ముఖం చాటేసి సోమందేపల్లికి వచ్చి ఓ హోటల్‌లో పనిచేస్తున్నట్లు తెలుసుకున్న వడ్డీ వ్యాపారులు అందరూ చూస్తుండగా కారులో ఎక్కించుకుని వెళ్లారు. పెనుకొండ వరకూ వెళ్లిన తర్వాత తిరిగి స్థానిక పీఎస్‌కు చేరుకుని అశోక్‌ను అప్పగించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.